
సాక్షి
కాకినాడ

గురువారం । 25 । మే । 2023



రూ.50 వేల విరాళం

ఆత్రేయపురం: ర్యాలి శ్రీ జగన్మోహినీ కేశవస్వామి ఆలయ అభివృద్ధికి శ్రీధర రామకృష్ణ, భానుమతి దంపతులు (అమెరికా) ఆన్‌లైన్ ద్వారా బుధవారం రూ.50 వేల విరాళం సమర్పించారు.



మిగులు జలాల విడుదల

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి బుధవారం 11,662 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడిచిపెట్టారు. బ్యారేజీ వద్ద నీటి మట్టం 10.45 అడుగులకు చేరింది.

గరిష్ఠం/కనిష్ఠం

42.5° / 27.0°

	గరిష్ఠం	కనిష్ఠం
రాజమహేంద్రవరం	42.5	29.0
కాకినాడ	38.9	28.3
అమలాపురం	39.8	27.0

న్యూస్‌రీల్

ప్రధానార్చకుని ఆరోగ్యపరిస్థితి విషమం

కాకినాడ ఆసుపత్రి నుంచి ఇంటికి తరలింపు



కోట శ్రీనివాస్, ప్రధానార్చకుడు

అన్నవరం: స్థానిక శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానం ఆలయ ప్రధానార్చకుడు కోట ఎల్‌వీఎస్ఎస్ శర్మ (శ్రీనివాస్)ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉంది. సోమవారం రాత్రి బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో కాకినాడలోని ప్రముఖ కార్పొరేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. మెదడులో రక్తనాళాలు గడ్డ కట్టి రక్త ప్రసరణ జరగకపోవడంతో వైద్య చికిత్సకు ఆయన శరీరం సహకరించడం లేదని వైద్యులు తెలిపినట్లు సమాచారం. వెంటిలేటర్ మీద ఉన్న ఆయనను వైద్యుల సూచనల మేరకు బుధవారం మధ్యాహ్నం అన్నవరం శివార్లలోని బంధువుల ఇంటికి తరలించారు.

సమన్వయంతో జగనన్న పాల వెల్లువ సక్సెస్

– ఏపీడీడీసీఎఫ్ ఎండీ అహ్మద్‌బాబు



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏపీ డెయిరీ డెవలప్‌మెంట్ కో ఆపరేటీవ్ ఫెడరేషన్ లిమిటెడ్ ఎండీ అహ్మద్‌బాబు

కాకినాడ సిటీ: జగనన్న పాలవెల్లువ–ఏపీ అమూల్ ప్రాజెక్టును జిల్లాలో విజయవంతంగా అమలు చేసేందుకు వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఏపీ డెయిరీ డెవలప్‌మెంట్ కో ఆపరేటీవ్ ఫెడరేషన్ లిమిటెడ్ (ఏపీడీడీసీఎఫ్) ఎండీ అహ్మద్‌బాబు కోరారు. కాకినాడ సూర్యకళామందిర్ ఆడిటోరియంలో జిల్లా పశుసంవర్థకశాఖ ఆద్వర్యంలో బుధవారం జరిగిన ప్రాజెక్టు జిల్లా స్థాయి శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ కృతికా శుక్లా, జేసీ ఎస్ ఇలక్కియలతో కలిసి ఆయన పాల్గొన్నారు. ప్రాజెక్టు లక్ష్యాలు, అమలు విధి విధానాల గురించి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. జిల్లా స్థాయి పర్యవేక్షణ యంత్రాంగం, బల్క్ మిల్క్ కూలింగ్ యూనిట్లు, ఆటోమెటిక్ మిల్క్ కలెక్షన్ యూనిట్లు, మహిళా డెయిరీ అసోసియేషన్ సెంటర్లు, మహిళా పాల ఉత్పత్తిదారుల సహకార సంఘాల ఏర్పాటు తదితర అంశాలను అహ్మద్‌బాబు క్షుణ్ణంగా వివరించారు. ఈ ప్రాంతంలో ప్రారంభించిన ఎన్నో పథకాలు, కార్యక్రమాలు జాతీయ స్థాయి గుర్తింపు సాధించాయన్నారు. ఇదే స్ఫూర్తితో జిల్లాలో ఏపీ అమూల్ ప్రాజెక్టును విజయవంతంగా అమలు చేసేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. స్వయం సహాయ సంఘాల సమావేశాల్లో ఈ ప్రాజెక్టుపై ప్రధాన దృష్టి సారించి అవగాహన పెంపొందించాలని సూచించారు. ఈ ప్రాజెక్టు మహిళల ఆర్థికంగా అభివృద్ధికి దోహదం చేస్తుందన్నారు. కలెక్టర్ కృతికా శుక్లా మాట్లాడుతూ త్వరలో జిల్లాలో తొలిదశలో 14 మండలాల పరిధిలోని 200 గ్రామాల్లో జనన్న పాలవెల్లువ–ఏపీ అమూల్ ప్రాజెక్టు అమలు కానుందన్నారు. ఇందుకు అధికారులు, సిబ్బంది పూర్తి స్థాయి అవగాహన పెంపొందించుకొని సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్, పశుసంవర్థకశాఖ జేడీ ఎస్ సూర్యప్రకాష్‌రావు, జెడ్పీ సీఈవో ఎన్‌వీవీ సత్యనారాయణ, ఇన్‌ఛార్జి డీఆర్వో కె శ్రీరమణి, కాకినాడ ఆర్డీవో బీవీ రమణ, పెద్దాపురం ఆర్డీవో జె సీతారామారావు, అముల్ ప్రతినిధులు, జిల్లా, మండల, గ్రామస్థాయి బృందాల సభ్యులు పాల్గొన్నారు.

సెబ్ అదనపు ఎస్పీగా బాధ్యతల స్వీకరణ

కాకినాడ క్రైం: జిల్లా స్పెషల్ ఎన్ఫోర్స్‌మెంట్ బ్యూరో(సెబ్) అదనపు ఎస్పీగా జి.ప్రేమ్ కాజల్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన అనంతరం జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్‌తోపాటు అదనపు ఎస్పీ శ్రీనివాస్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీ, అదనపు ఎస్పీలు ప్రేమ్ కాజల్‌కి అభినందనలు తెలిపారు. సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని ఆకాంక్షించారు.

ఉచిత ప్రవేశాలు రెండవ జాబితా విడుదల

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ఉచిత నిర్బంధ విద్యా హక్కు చట్టం ద్వారా ప్రైవేట్ పాఠశాలలో ఒకటవ తరగతి ప్రవేశాలకు దరఖాస్తు చేసుకున్న వారి రెండవ విడత జాబితా విడుదల చేసినట్లు డీఈఓ కేఎస్‌వీఎస్ అన్నపూర్ణ బుధవారం తెలిపారు. అర్హుల,కేటాయించిన స్కూల్స్ తదితర వివరాల జాబితాలను గ్రామ,వార్డు సచివాలయాల్లో ప్రదర్శించామన్నారు. పేరు ఉన్నవారు ఈ నెల 28వ తేదిలోగా అడ్మిషన్ పొందాలని సూచించారు. లేనిపక్షంలో అడ్మిషన్ రద్దు చేస్తామన్నారు.



కొవ్వూరు సభకు అశేషంగా తరలివచ్చిన విద్యార్థులను, ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



మా భవిష్యత్తు, మా నమ్మకం నువ్వే జగనన్నా..

గోదారి తీరాన విద్యార్థి ఉప్పెన

గోదావరి తీరాన విద్యార్థి ఉప్పెన ఎగసింది. తమ బతుకులకు.. బంగారు భవితను త్రికరణ శుద్ధిగా లిఖిస్తున్న జగన్ మావయ్యను కళ్లారా చూసేందుకు విద్యార్థులు మహాప్రవాహంలా తరలివచ్చారు. తమ భవిష్యత్తును నిర్దేశించే ఆయన ప్రసంగానికి కరతాళధ్వానాలతో మద్దతు పలికారు. 'మా నమ్మకం నువ్వే జగనన్నా' అంటూ ఎలుగెత్తి చాటారు. తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరులో జరిగిన సీఎం వైఎస్ జగన్ బహిరంగ సభకు వేలాదిగా విద్యార్థులు, ప్రజలు తరలివచ్చారు. సభా ప్రాంగణం బయట సైతం ఎండను లెక్క చేయకుండా పలువురు విద్యార్థులు, తల్లిదండ్రులు నిలుచుని, సీఎం ప్రసంగాన్ని శ్రద్ధగా ఆలకించి, ఆనందంతో కేరింతలు కొట్టారు.

- సీఎం వైఎస్ జగన్‌కు నీరా'జనం'
- కొవ్వూరు బహిరంగ సభకు పోటెత్తిన విద్యార్థులు
- ఘన స్వాగతం పలికిన అభిమానులు, పార్టీ శ్రేణులు
- అడుగడుగునా బ్రహ్మరథం
- తల్లుల ఖాతాల్లో జగనన్న విద్యా దీవెన నిధులు జమ చేసిన ముఖ్యమంత్రి

సాక్షి, రాజమహేంద్రవరం/కొవ్వూరు: జగనన్న విద్యా దీవెన పథకం కింద 2023 జనవరి – మార్చి త్రైమాసికానికి సంబంధించిన ఫీజు రీయింబర్స్‌మెంట్ మొత్తాన్ని విడుదల చేసేందుకు.. బుధవారం కొవ్వూరు వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి విద్యార్థులు, ప్రజలు అడుగడుగునా ఆనందోత్సాహాలతో నీరా'జనం' పట్టారు. తాడేపల్లిలోని నివాసం నుంచి సీఎం జగన్ కొవ్వూరులోని బుద్ధుడి జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు ఉదయం చేరుకున్నారు. అక్కడ మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, అధికారులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. అక్కడి నుంచి 2 కిలోమీటర్లకు పైగా రోడ్‌షో నిర్వహించారు. రోడ్‌షోలో అడుగడుగునా ప్రజలు బ్రహ్మరథం పట్టారు. సీఎం బస్సుపై పూలు చల్లుతూ తమ అభిమానాన్ని చాటుకున్నారు. వారందరికీ చిరునవ్వుతో అభివాదం చేస్తూ ముందుకు సాగిన సీఎం పట్టణంలోని సత్యవతి నగర్‌లో ఏర్పాటు చేసిన సభా స్థలికి చేరుకున్నారు. తొలుత జగనన్న విద్యా దీవెన పథకం లబ్ధిదారులైన విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. వారితో గ్రూప్ ఫొటో దిగారు. అనంతరం దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి, అంజలి ఘటించారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

హోరెత్తిన 'జై జగన్' నినాదాలు

సీఎం జగన్ ప్రసంగించేందుకు మైక్ చేత పట్టగానే విద్యార్థులందరూ ఒక్కసారిగా లేచి 'జై జగన్' అని పెద్ద ఎత్తున నినదించారు. 40 నిమిషాల పాటు సాగిన సీఎం ప్రసంగంలో అడగడుగునా నినాదాలు హోరెత్తాయి. 'ప్రతిభ మీది.. మీ ఉన్నత విద్య బాధ్యత నాది'..

– మిగతా 8లో▸



ప్రియనేతకు 'సుమ' స్వాగతం : కొవ్వూరు రోడ్ షోలో సీఎం జగన్‌కు పూల జల్లులతో ప్రజల స్వాగతం

కొవ్వూరుకు వరాల జల్లు

కొవ్వూరు నియోజకవర్గ అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వరాల జల్లు కురిపించారు. నియోజకవర్గ అభివృద్ధి పనులను హోం మంత్రి తానేటి వనిత ప్రస్తావించగా.. సీఎం వెంటనే ఆమోదం తెలిపి నిధుల విడుదలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. కొవ్వూరులో డిగ్రీ కళాశాల భవన నిర్మాణానికి నిధులు కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. మూడు లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలు, కొవ్వాడ కెనాల్ వద్ద కల్వర్ట్ నిర్మాణం, మూడు మండలాల్లో మూడు అంబేడ్కర్ భవనాలు, ముస్లింలకు షాదీఖానా, ఎస్సీలకు కమ్యూనిటీ హాలు, కాపు కల్యాణ మండపం నిర్మాణానికి సహకరిస్తామని హామీ ఇచ్చారు.

చదువుకోమనీ సాయం



జగనన్న విద్యాదీవెన మెగా చెక్కును విద్యార్థులు, తల్లులకు అందజేస్తున్న ఎంపీ వంగా గీత, కలెక్టర్ కృతికా శుక్లా

- విద్య, వైద్య రంగాలకు ప్రభుత్వం ప్రాధాన్యత
- జగనన్న విద్యాదీవెనతో పేదల కుటుంబాల్లో వెలుగులు
- కాకినాడ ఎంపీ వంగా గీత

కాకినాడ సిటీ: పేద విద్యార్థులకు ఉన్నత విద్యను దగ్గర చేసేందుకు జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన తదితర పథకాలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోందని ఎంపీ వంగా గీత అన్నారు. ఈ ఏడాది జనవరి–మార్చి త్రైమాసికానికి సంబంధించి జగనన్న విద్యాదీవెన ఫీజు రీయంబర్స్‌మెంట్ మొత్తాన్ని విద్యార్థుల తల్లుల ఖాతాల్లో జమ చేసే కార్యక్రమాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరులో బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి కలెక్టరేట్ నుంచి ఎంపీ గీత, కలెక్టర్ కృతికా శుక్లా, కొడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, డీఆర్వో కె శ్రీరమణి తదితరులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థుల నుద్దేశించి ఎంపీ మాట్లాడారు. జగనన్న విద్యాదీవెన పథకాన్ని సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. ఐటీఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, ఇంజినీరింగ్, మెడిసిన్ తదితర కోర్సులు చదివే పేద విద్యార్థులు కళాశాలలకు చెల్లించాల్సిన పూర్తి ఫీజుల మొత్తాన్ని క్రమం తప్పకుండా త్రైమాసికం ముగిసిన వెంటనే ప్రభుత్వం అందజేస్తోందన్నారు. ప్రతిభావంతులైన విద్యార్థులు ఆర్థిక సమస్యల వల్ల ఉన్నత చదువులకు దూరమయ్యే పరిస్థితిలో పూర్తిగా మార్పు వచ్చిందన్నారు. విద్యారంగ పథకాలు, కార్యక్రమాల వల్ల మెరుగైన ఫలితాలు కనిపిస్తున్నాయన్నారు.

కలెక్టర్ కృతికా శుక్లా మాట్లాడుతూ జిల్లాలో జగనన్న విద్యాదీవెన పథకం కింద 2023, జనవరి–మార్చి త్రైమాసికానికి 37,787 మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, క్రిస్టియన్, ముస్లిం, మైనారిటీ, కాపు విద్యార్థుల తల్లుల ఖాతాల్లో రూ. 31.05 కోట్లు జమ అవుతున్నట్లు తెలిపారు. విద్యార్థులు బాగా చదువుకొని కెరీర్‌పరంగా ఉన్నత స్థానాలకు ఎదగాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న విద్యాదీవెన, జగనన్న వసతి దీవెన తదితర పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాగిరెడ్డి చంద్రకళాదీప్తి విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమాధికారి ఎస్‌వీఎస్ సుబ్బలక్ష్మి, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి ఎ విజయశాంతి, సహాయ సాంఘిక సంక్షేమాధికారి పిఎస్‌వీ సత్యనారాయణ, వివిధ కళాశాలల విద్యార్థులు, తల్లిదండ్రులు హాజరయ్యారు.

విద్యార్థులకు అందజేసిన విద్యాదీవెన సాయం (రూ.లలో)

కేటగిరి	విద్యార్థులు	ఆర్థికసాయం
ఎస్సీ	334	37,55,178
ఎస్టీ	318	19,05,261
బీసీ	20.291	15,63,03,156
ముస్లిం మైనార్టీ	579	48,85.213
క్రిస్టియన్ మైనార్టీ	131	12,19,161

చదువులకు ఆటంకం లేకుండా..



ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నిరుపేద విద్యార్థుల చదువులకు ఎలాంటి ఆటంకం కలుగకుండా జగనన్న విద్యాదీవెనతో ఆదుకుంటున్నారు. నాలాంటి పేద విద్యార్థి చదువుకు ఇది ఎంతో ఉపయోగపడుతుంది. మా అమ్మ, నాన్నలు ఇద్దరు కూలి పనులకు వెళ్లి నన్ను చదివిస్తున్నారు. మా ఊరికి సుమారు 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న కాకినాడలో చదువుకునేందుకు వస్తున్నాను. జగనన్న నాలాంటి పేద విద్యార్థులకు మామయ్యలా నిలిచి జగనన్న విద్యాదీవెన ద్వారా ఫీజులను చెల్లించడం ఆనందంగా ఉంది. నేను, నా కుటుంబం ఎప్పుడూ ముఖ్యమంత్రికి రుణపడి ఉంటాం.

– పి దివ్యదుర్గశ్రీ, గొర్రిపూడి, కరప మండలం.

మాతా, శిశు మరణాల నివారణకు సమన్వయ కృషి

కాకినాడ సిటీ: జిల్లాలో మాతా, శిశు మరణాల నివారణకు వైద్య, స్త్రీ శిశు సంక్షేమ శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో కృషి చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి ఆర్ రమేష్ కోరారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్ వివేకానంద సమావేశపు హాలులో గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధ చట్టం అమలు, మాతా, శిశు మరణాల సమీక్ష, నివారణపై ఏర్పాటైన జిల్లా స్థాయి కమిటీల సమావేశాలలో ఆయన మాట్లాడారు. జిల్లాలో హైరిస్క్ గర్భధారణ గుర్తించిన మహిళల ఆరోగ్యస్థితిపై ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు నిరంతర పర్యవేక్షణ పాటించి, ఆసుపత్రిలో సురక్షితంగా ప్రసవించి తల్లీ, బిడ్డ క్షేమంగా తిరిగి ఇంటికి వెళ్లేలా చూడాలని రమేష్ కోరారు. ఐసీడీఎస్ పీడీ కె ప్రవీణ, డీసీహెచ్ఎస్ డాక్టర్ బి విష్ణువర్ధని, జీజీహెచ్ గైనిక్ విభాగాధిపతి డాక్టర్ లావణ్య కుమారి, ఆర్బీఎస్‌కే కోఆర్డినేటర్ సత్యనారాయణ, పిడియాట్రీషియన్ డాక్టర్ ఎంఎ సిరాజు, డీపీహెచ్ఎంఓ పీవీ రమణమ్మ, డెమో సీహెచ్ రాజు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు చక్రవర్తి, బీబీ సపూరా, పలువురు వైద్యాధికారులు, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అభిరుచి.. అశ్వాదన



పిఠాపురం : గుర్రపు స్వారీ అనేది ఆటవిడుపు, సాహస క్రీడ. ప్రస్తుతం ఇది ట్రెండ్‌గా మారింది. యువతతో పాటు చిన్న పిల్లలు కూడా గుర్రపు స్వారీ నేర్చుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు. తల్లిదండ్రులు సైతం తమ పిల్లలకు హార్స్ రైడింగ్‌లో శిక్షణ ఇప్పించి.. వారు గుర్రాలపై స్వారీ చేస్తుంటే.. చూసి ముచ్చటపడుతున్నారు. యువత, చిన్నారుల తల్లిదండ్రుల ఆసక్తికి అనుగుణంగా హార్స్ రైడింగ్ ట్రైనింగ్ సెంటర్లు వెలుస్తున్నాయి. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో సుమారు 100 మంది 250 గుర్రాల వరకూ పెంచుతున్నారంటే.. గుర్రపు స్వారీపై యువత ఆసక్తి ఏంటో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. కాకినాడ, రాజమహేంద్రవరం తదితర ప్రాంతాల్లో గుర్రపు స్వారీ శిక్షణ కేంద్రాలు వెలిశాయి. గతంలో గుర్రపు స్వారీ నేర్చుకోవాలంటే పెద్ద పెద్ద నగరాలకు వెళ్లాల్సి వచ్చేది. ప్రస్తుతం ఓ మోస్తరు పట్టణాల్లోనూ శిక్షణ కేంద్రాలు వెలుస్తున్నాయి. వేసవి కావడంతో యువతతో పాటు చిన్నారులు కూడా గుర్రపు స్వారీ నేర్చుకునేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు.

- గుర్రం స్వారీపై యువత, చిన్నారుల ఆసక్తి
- వేసవి సెలవులు కావడంతో హార్స్ రైడింగ్‌పై దృష్టి
- సముద్ర తీర ప్రాంతాల్లో వెలుస్తున్న శిక్షణ కేంద్రాలు

మానసిక వికాసానికి, శారీరక ఆరోగ్యానికి మేలు


గుర్రపు స్వారీ అనేది పలు మానసిక, శారీరక సమస్యలకు సంజీవనిలా పనిచేస్తుంది. పోలియో, పక్షవాతం, మెదడు, వెన్నెముక సమస్యలు, వినికిడి లోపాలు, భావవ్యక్తీకరణ, స్థిమితం కోల్పోవడం వంటి వాటికి చక్కటి చికిత్సగా పనిచేస్తుంది. ముఖ్యంగా మానసిక వికాసం లోపించిన పిల్లలకు మంచి ఫలితాలనిస్తుందని నిపుణులు చెబుతున్నారు. పిల్లలు గుర్రపు స్వారీ చేయడం వల్ల వారి ఏకాగ్రత, ఆత్మవిశ్వాసం పెరుగుతాయి. గుర్రం కళ్లెం పట్టుకోవడం, నిటారుగా కూర్చోవడం, అశ్వాన్ని దూమికించడం, ఒకే లయలో ముందుకుసాగడం వంటి చర్యల వల్ల మెదడుకి, శరీరానికి మధ్య సమన్వయం ఏర్పడి మానసిక ఉత్తేజం కలుగుతుందని.. ఫలితంగా అనేక రుగ్మతలు వాటంతట అవే తగ్గిపోతాయని చెబుతున్నారు.



చిన్ననాటి కల నేరవేరిందిలా..

ఎప్పటి నుంచో గుర్రపు స్వారీ చేయాలన్న కోరిక ఉండేది. శిక్షణ కేంద్రాలు అందుబాటులో లేకపోవడంతో ఇప్పటి వరకూ కుదరలేదు. కాకినాడ తీరంలో గుర్రపు స్వారీ శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేయడంతో ఆ కోరిక ఇలా తీరింది. గుర్రపు స్వారీ చేయడం చాలా ఆనందంగా ఉంది. శిక్షణ పొందిన గుర్రాలు కావడంతో ఎలాంటి ప్రమాదం లేకుండా నేర్చుకుంటున్నాను.

– అభిషేక్, కాకినాడ



గుర్రపు స్వారీకి అనువైన ప్రాంతంగా తీరం

గుర్రపు స్వారీ అనేది సాహస క్రీడ. ప్రమాదాలకు ఎక్కువ అవకాశాలున్నాయి. అందుకే ఎలాంటి ప్రమాదాలు జరిగినా రైడర్‌కు ప్రమాదం జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటాం. గట్టి నేలల్లో ప్రమాదాలకు ఎక్కువ అవకాశం ఉండటంతో ఇసుల నేలల్లోనే నేర్పాల్సి ఉంటుంది. దీని కోసం ప్రత్యేకంగా ఇసుకను తెచ్చి వేస్తుంటారు. అలాంటి పరిస్థితి లేకుండా తీర ప్రాంతాల్లో ఉన్న ఇసుక మేటలు గుర్రపు స్వారీలకు అనుకూలంగా ఉండటంతో కాకినాడ తీరం ప్రాంతంలో ఉన్న ఇసుక నేలల్లో గత నెల రోజులుగా గుర్రపు స్వారీ శిక్షణ ఇస్తున్నాము. రోజూ ఉదయం, సాయంత్రం రెండేసి గంటల చొప్పున నేర్పుతున్నాము.

– కె.అనిల్‌రెడ్డి, గుర్రపు స్వారీ శిక్షకుడు, కాకినాడ



సభా వేదికపై సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు

జగనన్నకు జై



అదిరిందో.. అయనే: సీఎం జగన్‌ను చూసి ఇంట్లో నుంచి ఆనందంతో చేతులూపుతున్న ఓ కుటుంబం



ఆనంద గోదారి: అన్నను చూసిన వేళ మురిసిపోతున్న చెల్లెమ్మలు



జయహో జగనన్నా..: విద్యార్థినుల ఆనందోత్సాహం

వరదల వేళ ఇరు తీరాలనూ ఒరుసుకుంటూ పరవళ్లు తొక్కే అఖండ గోదావరి సైతం చిన్నబోయేలా.. ఆ నదీ తీరాన ఉన్న కొవ్వూరులో జనవాహిని ఉరకలెత్తింది.. విద్యార్థి కెరటం ఎగసిపడింది.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆగమించిన వేళ.. పట్టణంలో ఎటు చూసినా జనప్రవాహమే.. పట్టణంలో ఎక్కడ చూసినా సమూహాలుగా ఉన్న విద్యార్థులే.. జగనన్న విద్యా దీవెన పథకం నిధులను విడుదల చేసేందుకు బుధవారం కొవ్వూరు వచ్చిన తమ ప్రియతమ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు విద్యార్థులతో పాటు అశేషంగా తరలివచ్చిన ప్రజలు అడుగడుగునా బ్రహ్మరథం పట్టారు. సభా ప్రాంగణంలోని గ్యాలరీలన్నీ విద్యార్థులతో, జనంతో నిండిపోయాయి. నింగిన సూరీడు మండిపోతున్నా లెక్క చేయకుండా.. సభా ప్రాంగణం బయట సైతం పలువురు విద్యార్థులు, తల్లిదండ్రులు నిలుచుని, సీఎం ప్రసంగాన్ని శ్రద్ధగా ఆలకించి, ఆనందంతో కేరింతలు కొట్టారు.

– సాక్షి, రాజమహేంద్రవరం



నీ రాక కోసం..: సీఎం జగన్ వచ్చిన వేళ సెల్ ఫోన్లలో ఫొటోలు తీసుకుంటూ.. నిండైన ఆనందంతో స్వాగతిస్తున్న చెల్లెమ్మలు



మా గుర్తుగా..: జ్ఞాపిక అందజేస్తున్న మంత్రులు తానేటి వనిత, వేణు తదితరులు



అన్న వచ్చిన వేళ.. ఆనంద హేల



ఇసుక వేసినా రాలనంతగా..: కొవ్వూరులో జన గోదారి



ఉత్సాహ తరంగాలై..: సీఎంను చూసి ఉరకలెత్తిన విద్యార్థి లోకం

మండుటెండలో బండిపై జనం వద్దకు..

పిఠాపురం: సాధారణంగా ప్రజాప్రతినిధులంటే అధికారులు.. మందీమార్బలంతో హడావుడిగా వస్తుంటారు. కానీ పిఠాపురం ఎమ్మెల్యే పెండెం దొరబాబు బుధవారం అవేమీ లేకుండా ఒంటరిగా మండుటెండలో బండిపై తిరిగి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. గొల్లప్రోలు నగర పంచాయతీ పరిధిలో నిర్మిస్తున్న జగనన్న కాలనీలో పర్యటించారు. ఇళ్లకు వెళ్లి సౌకర్యాలపై ఆరా తీశారు. ఆయన అనుకోకుండా తమ ఇళ్లకు రావడంతో నివాసితులు ఆనందం వ్యక్తం చేశారు. 'ఇలా ఇంటికి వచ్చి అడిగిన నాయకుడు మీరే' అంటూ తమ సమస్యలు చెప్పుకుని, ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.



సమస్యలు తెలుసుకోవడానికి మోటార్ సైకిల్‌పై వెళ్తున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు

గోదారి తీరాన విద్యార్థి ఉప్పెన

7వ పేజీ తరువాయి ▶

'నేను విన్నాను.. నేను ఉన్నాను' అని సీఎం చెప్పగానే విద్యార్థుల చప్పట్లు, ఈలలు, కేకలతో సభా ప్రాంగణం దద్దరిల్లింది. తమ భవిష్యత్తుకు భరోసా దొరికిందని విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు. 'కులం చూడం.. మతం చూడం' అనగానే హర్షాతిరేకాలతో సీఎంకు అభినందనలు తెలిపారు. తమ ప్రభుత్వం పేదల అభ్యున్నతికి పాటుపడుతున్న విధానాన్ని వివరించగానే తమ బిడ్డ జగన్ తమకు చేస్తున్న మేలును పలువురు గుర్తు చేసుకున్నారు. «మీ బిడ్డను ఎదిరించేందుకు తోడేళ్లన్నీ ఒక్కటవుతున్నాయి. రాబోయే కురుక్షేత్రంలో మీరు అండగా నిలవాలి» అని జగన్ పేర్కొనగానే ప్రజలు, మహిళలు ఒక్కసారిగా భావోద్వేగానికి గురయ్యారు. ఎందరు వచ్చిన తమ బిడ్డ, అన్న, తమ్ముడు జగన్‌ను కాపాడుకుంటామని నిండైన మనసుతో ప్రతినబూనారు. నాలుగేళ్ల వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై సీఎం జగన్ వివరిస్తూంటే కరతాళధ్వనులు, ఈలలు, కేకలతో సభా ప్రాంగణం మార్మోగిపోయింది. ప్రసంగం తర్వాత రాష్ట్రవ్యాప్తంగా 9.95 లక్షల మంది విద్యార్థుల తల్లుల ఖాతాల్లో రూ.703 కోట్ల జగనన్న విద్యా దీవెన నిధులను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బటన్ నొక్కి జమ చేశారు. ఇందుకు సంబంధించిన డెమో చెక్కుతో గ్రూప్ ఫొటో దిగారు. ఈ సందర్భంగా సీఎంకు పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు జ్ఞాపికలు అందజేశారు. శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. సభా ప్రాంగణం నుంచి హెలిప్యాడ్‌కు చేరుకున్న సీఎం.. అక్కడ పార్టీ నేతలు, ఎమ్మెల్యేలతో కాసేపు ముచ్చటించారు. అనంతరం తాడేపల్లిలోని నివాసానికి బయలుదేరిన ముఖ్యమంత్రికి మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, ఆత్మీయ వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో మంత్రులు కొట్టు సత్యనారాయణ, చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాల కృష్ణ, పినిపే విశ్వరూప్, తానేటి వనిత, బొత్స సత్యనారాయణ, మేరుగ నాగార్జున, శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, ఎంపీలు పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, పిల్లి సుభాష్‌చంద్రబోస్, మార్గాని భరత్‌రామ్, ఎమ్మెల్యేలు జక్కంపూడి రాజా, తలారి వెంకట్రావ్, చిర్ల జగ్గిరెడ్డి, జి.శ్రీనివాస్ నాయుడు, డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, కొండేటి చిట్టిబాబు, వాసుబాబు, ఎమ్మెల్సీలు కుడుపూడి సూర్యనారాయణరావు, బొమ్మి ఇజ్రాయిల్, వంకా రవీంద్ర, కౌరు శ్రీనివాసరావు, ఏపీ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ, డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు, హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు, రాజమహేంద్రవరం నగరాభివృద్ధి సంస్థ (రుడా) చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి, ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్, డీసీఎంఎస్ చైర్మన్ ఎస్.మణికుమారి, భూదాన బోర్డు చైర్మన్ విజయభాస్కరరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ కోడూరి శివరామకృష్ణ, కొవ్వూరు మున్సిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి, జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్‌భరత్, జిల్లా ఎస్పీ సీహెచ్ సుధీర్‌కుమార్‌రెడ్డి, రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కమిషనర్ కె.దినేష్‌కుమార్, అసిస్టెంట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్‌రెడ్డి, ఆర్డీఓలు ఎ.చైత్రవర్షిణి, ఎస్.మల్లిబాబు తదితరులు పాల్గొన్నారు.

కన్నీళ్లు తెప్పించిన విద్యార్థిని ప్రసంగం

సీఎం సభలో బీకామ్ విద్యార్థిని దివ్య చేసిన ప్రసంగం సభికులను కన్నీరు పెట్టించింది. ''మా అమ్మ మూగ, చెవిటి. తండ్రి పెరాలిసిస్‌తో దివ్యాంగుడు. ఇద్దరం ఆడపిల్లలం. అలాంటి పరిస్థితుల్లో మా చదువులు ఎలాగని భయపడ్డాం. దేవుడిలా మీరొచ్చి అమ్మ, నాన్నకు పెన్షన్ ఇస్తున్నారు. నేను కార్పొరేట్ కళాశాలలో ఇంగ్లిష్ మీడియంలో డిగ్రీ చదువుకునేందుకు ఫీజు మొత్తం చెల్లించి మా కుటుంబానికి 'నేనున్నా'నంటూ భరోసా ఇచ్చారన్నా'' అంటూ దివ్య భావోద్వేగానికి గురైంది. మీకు జీవితాంతం రుణపడి ఉంటామన్నా అని వేదన, కృతజ్ఞత నిండిన స్వరంతో చెప్పింది. సభలో ఆమె కన్నీరు పెట్టుకోవడం చూసిన అక్కడి విద్యార్థులు, ప్రజల కళ్లు చెమర్చాయి.

జగనన్న సమన్యాయానికి నేనే నిదర్శనం

జగనన్న ప్రభుత్వంలో కుల, మత, జాతి విభేదాల్లేవు. అందరికీ సమన్యాయమే జగనన్న లక్ష్యం. అందుకు నేనే నిదర్శనం. దళితులకు ధైర్యం జగనన్న. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధనకు పాటు పడుతున్న నాయకుడు జగనన్న. గిరిజనుల గుండెచప్పుడు, మైనార్టీలకు అండ, బలహీనులకు బలం, ఐదు కోట్ల ఆంధ్రుల నమ్మకం జగనన్న. ఓట్లు ముఖ్యం కాదు చదువులు కావాలని విద్యా రంగంలో వినూత్న మార్పులు తీసుకువచ్చారు. ప్రభుత్వ విద్యా సంస్థలను కార్పొరేట్ స్థాయికి చేర్చిన ఘనత ఆయనకే దక్కుతుంది. హిస్టరీ చదివుంటారు.. వినుంటారు.. కానీ హిస్టరీ క్రియేట్ చేసిన నాయకుడిని ఎప్పుడైనా చూశారా? ఆయనే మన జగనన్న. విద్యను పేదవాడి హక్కుగా మార్చితే ప్రతిపక్షాలు చూడలేకపోతున్నాయి.

– తానేటి వనిత, హోం మంత్రి

జిల్లాలో 23 వేల మందికి లబ్ధి

తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా జగనన్న విద్యాదీవెన పథకంలో 23 వేల మంది విద్యార్థులు లబ్ధి పొందుతున్నారు. వారి తల్లుల ఖాతాల్లో రూ.23.25 కోట్లు జమ అవుతున్నాయి. పేదరికాన్ని అధిగమించి, ఉన్న స్థానాలు అధిరోహించాలంటే విద్య ఒక్కటే మార్గమని గుర్తించిన సీఎం జగన్.. అమ్మ ఒడి, జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన, నాడు – నేడు వంటి వినూత్న కార్యక్రమాలు అమలు చేస్తున్నారన్నారు. ఉన్నత చదువులు చదివిన విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఇంటర్న్‌షిప్ ప్రవేశపెట్టారు. పోటీ ప్రపంచంలో నిలదొక్కుకునేందుకు ఇది ఎంతో తోడ్పాటునిస్తుంది.

– కె.మాధవీలత, కలెక్టర్, తూర్పు గోదావరి